ఆయూష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

వైద్య శిబిరంలో వృద్ధులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

లింగంపేట, సెప్టెంబర్ 3: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఆయూష్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధాప్యంలో వచ్చే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో ఆయూష్ విభాగం వైద్యురాలు విజయ, జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీకాంత్, ఫార్మాసిస్టు శ్వేత, ఎంఎన్‌వో రాజన్న, ఏఎన్‌ఎంలు రాజ్యలక్ష్మి, భాగ్య, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్, సిబ్బంది సాయిలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు నాయకుల చేయూత

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 3: మూడు రోజులుగా ఏకధాటిగా కురిసిన వర్షాలకు ఇండ్లు కూలిపోయి నిరాశ్రయులైన కుటుంబాలకు స్థానిక నాయకులు చేయూత నందించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని నీలకంఠేశ్వరాలయ పరిసర ప్రాంతంలో ఉన్న నాలుగు కుటుంబాలు వర్షాలకు నిలువ నీడలేకుండాపోయింది. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు ఆ కుటుంబాలను అంగన్‌వాడీ కేంద్రానికి తరలించి బియ్యం, పప్పు, కిరాణం, భోజన సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పద్మా శ్రీకాంత్, జంగం నీలకంఠం అప్ప, నునుగొండ శ్రీనివాస్, భూంగారి రాము, గాదె తిరుపతి, సుభాశ్ అప్ప తదితరులున్నారు.

కబ్జాలను తొలగించాలని వినతి

బాన్సువాడ, సెప్టెంబర్ 3: పట్టణంలో కల్కి చెరువు, కాలువలు, శిఖం భూములు కబ్జాకు గురయ్యాయని, అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్లపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం పట్టణంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టిని కలిసి వినతిపత్రం అందజేశారు. కబ్జాలపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, శకంర్ గౌడ్, కోనాల గంగారెడ్డి, ప్రసాద్ తదితరులు ఉన్నారు. సబ్ కలెక్టర్‌ను పీఆర్టీయూ ప్రతినిధులు, ఉపాధ్యాయులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. అనంతరం సబ్ కలెక్టర్‌ను కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్లు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

పరిశుభ్రతను పాటించాలి: ఆర్డీవో ప్రభాకర్

ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 3 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యంగా ఉండాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ సూచించారు. మంగళవారం ఆయన ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని గిరిజన గురుకుల కళాశాల ప్రాంగణంలోని భోజన శాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ మహేందర్ కుమార్ ఉన్నారు.

'ఇండ్లు కోల్పోతున్నాం.. ఆదుకోవాలి'

నిజాంసాగర్, సెప్టెంబర్ 3: మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో చేపట్టిన రహదారి విస్తరణ పనుల్లో ఇండ్లు, వ్యాపార సముదాయాలను కోల్పోతున్నామని, తాము నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ సవాయిసింగ్‌కు వినతి పత్రం అందజేశారు. రహదారికి ఇరువైపులా 50 అడుగుల మేర పనులు కొనసాగుతున్నాయని, ఐదు అడుగులు తగ్గించి డ్రైనేజీ నిర్మించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, దఫేదార్ విజయ్, ఆకాశ్, జక్సాని శ్రీనివాస్, భాను, ఎలగందల రాజు, విజయ్, రాము, వెంకన్న, మల్లేశం, నాగరాజు, కాశీనాథం, శ్రీనివాస్, భాస్కర్,ని ఖిల్, వికాస్ గౌడ్, శ్రీధర్ ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్ల వితరణ

దాత అందజేసిన రెయిన్ కోట్లను ధరించిన పారిశుద్ధ్య కార్మికులు

భిక్కనూరు, సెప్టెంబర్ 3: వర్షాల నేపథ్యంలో భిక్కనూరు గ్రామ పంచాయతీ కార్మికులకు న్యాయవాది లింగాల రాజాబాబు గౌడ్ రెయిన్ కోట్లను ఉచితంగా అందజేశారు. 28 మంది కార్మికులకు రెయిన్ కోట్లు వితరణ చేసినట్లు ఆయన తెలిపారు. పంచాయతీ కార్యదర్శి మహేశ్ గౌడ్,సిబ్బంది రాజు, లక్ష్మణ్, నవీన్, నర్సింగ్ రావు,శరత్, కళ్యాణ్, చంద్రశేఖర్, రాము, రంజిత్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 3: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో మంగళవారం కళాబృందం ఆధ్వర్యంలో పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్‌లలో వచ్చే మెస్సేజ్‌లకు స్పందించవద్దన్నారు. కళాబృందం ఇన్‌చార్జి ప్రభాకర్, పోలీసులు శేషారావు, సాగర్ గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'వాగును దాటే ప్రయత్నం చేయొద్దు..'

మద్నూర్, సెప్టెంబర్ 3: వాగుల వద్ద వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నచోట దాటడానికి ప్రయత్నం చేయవద్దని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని గోజేగావ్ గ్రామ శివారులో ఉన్న వాగును పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీవో రాణి, ఎంపీవో వెంకటనర్సయ్య, గిర్దావర్ శంకర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ ఉన్నారు.

ఘనంగా ఎడ్ల పోలాల అమావాస్య పండుగ

నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 3: బీర్కూర్ మండలంలోని దామరంచ, కిష్టాపూర్, అన్నారం తదితర గ్రామాల్లో మంగళవారం ఎడ్ల పోలాల అమావాస్య పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్లను అందంగా అలంకరించి గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. అనంతరం గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల చుట్టూ తిప్పారు.

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

- భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి,సెప్టెంబర్ 3 : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి డివిజన్, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధిక వర్షాల ప్రభావం ఇంకా ముగిసిపోనందున అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వర్షాలతో దెబ్బతిన్న రహదారులను సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. వర్షాలతో మృతిచెందిన వారి, దెబ్బతిన్న ఇండ్ల వివరాలను అందించాలని రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాల భవనాలు దెబ్బతిని ఇబ్బందిగా మారితే వివరాలను అందించాలన్నారు. అవసరం అనుకుంటే పాఠశాలను సరి చేసేవరకూ సెలవులు ఇవ్వాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. వంగిపోయిన విద్యుత్ స్తంభాలను సరిచేయాలని ఆదేశించారు. వ్యాధుల ప్రబలకుండా అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. వైద్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలి

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ కోరారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఈ సంవత్సరం పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన 'మట్టి గణపతులనే పూజిద్దాం' పోస్టర్లను తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మట్టి గణపతి విగ్రహాల ద్వారా పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై విద్యా సంస్థల్లో క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చేతి వృత్తుల వారికి మట్టి విగ్రహాల తయారీపై శిక్షణ, పర్యావరణ పరిరక్షణపై కళాజాత కూడా నిర్వహిస్తామని తెలిపారు.

తండాల్లో ఉపవాస దీక్షలు



శ్రావణమాస ఉపవాస దీక్షలో భాగంగా నైవేద్యంతో గిరిజన మహిళలు

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 3: ఎల్లారెడ్డి మండలంలోని లక్ష్మాపూర్ జీపీ పరిధిలోని జానకంపల్లి ఖుర్దు తండా, హాజీపూర్ తండాల్లో మంగళవారం శ్రావణ మాస ఉపవాస దీక్షలను చేపట్టి జగదాంబ సేవాలాల్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన వస్త్రాలు ధరించి, ఇంటి వద్ద తయారు చేసిన నైవేద్యంతో భారీ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం భోగ్‌భండార్ నిర్వహించి నైవేద్యం సమర్పించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం ఆలయం వద్ద మహిళలు నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ ఉల్లాసంగా గడిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కంటైనర్

కంటైనర్ డ్రైవర్ మృతి

కామారెడ్డి, సెప్టెంబర్ 3: ఆగి ఉన్న లారీని కంటైనర్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సీఐ కథనం మేరకు.. మంగళవారం ఉదయం 5.30 గంటలకు కంటైనర్ లారీ హర్యానా నుంచి జహీరాబాద్ వెళ్తోంది. కామారెడ్డి శివారులో జాతీయ రహదారిపై దాబా వద్ద సూచికలు లేకుండా ఆపి ఉన్న తమిళనాడుకు చెందిన లారీని కంటైనర్ ఢీకొట్టింది. కంటైనర్ నడుపుతున్న రాజస్థాన్‌కు చెందిన షారుక్ ఖాన్ (22) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువు అక్బర్ ఖాన్ ఫిర్యాదు మేరకు తమిళనాడు లారీ డ్రైవర్ రాజపండి మధురైపై పోలీసులు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.

బాన్సువాడలో పారిశుద్ధ్య పనుల పరిశీలన

బాన్సువాడ, సెప్టెంబర్ 3: బాన్సువాడ పట్టణంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, కమిషనర్ శ్రీహరిబాబు మంగళవారం పర్యటించి, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం ఫిల్టర్ బెడ్, ప్రధాన రహదారి, కల్కి చెరువు గట్టును పరిశీలించారు. మూడో వార్డులో వర్షానికి కూలిపోయే స్థితిలోఉన్న ఇంట్లో ఉన్న కుటుంబాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించారు. వెంట కౌన్సిలర్లు నర్సుగోండ, అధికారులు శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, నగేశ్ ఉన్నారు.

ఎల్లారెడ్డిలో పెద్దచెరువును పరిశీలించిన నాయకులు

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 3: పట్టణంలోని పెద్దచెరువులోకి వస్తున్న వరదను స్థానిక నాయకులు మంగళవారం పరిశీలించారు. వార్డు కౌన్సిలర్లు పద్మా శ్రీకాంత్, జంగం నీలకంఠం అప్ప, పోచయ్య, అల్లం శ్రీను, నాయకులు నునుగొండ శ్రీనివాస్, గాదె తిరుపతి, సుభాష్ అప్ప తదితరులున్నారు.

ధ్వంసమైన రోడ్లు.. కూలిన ఇండ్లు..

- జిల్లాను అతలాకుతలం చేసిన వాన
- పలు గ్రామాల్లో నిలిచిపోయిన రాకపోకలు
- నిరాశ్రయులకు పునరావాస కేంద్రాల ఏర్పాటు
- పరిశీలించిన అధికారులు, నాయకులు

లింగంపేట్ మండలం భవానీపేట్‌లో కూలిపోయిన నివాసగృహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటలో కూలిపోయిన ఇంటి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న డీఎల్పీవో

నాగిరెడ్డిపేట/లింగంపేట, సెప్టెంబర్ 3: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం, గోపాల్‌పేట గ్రామంలో పలు ఇండ్లు కూలిపోయాయి. పోచారం గ్రామానికి చెందిన కర్రోల్ల కిరణ్, కర్రోల్ల లక్ష్మి, కమ్మరి సిద్ధిరాములు, కమ్మరి సత్తమ్మ, గోపాల్‌పేటకు చెందిన రాజిపేట లక్ష్మి, రాజిపేట రామవ్వ, కోమటూరి విజయలక్ష్మి పశువుల పాక కూలిపోయినట్లు పంచాయతీ కార్యదర్శులు తిరుపతి, కిష్టయ్య తెలిపారు. కూలిపోయిన ఇండ్లను డీఎల్పీవో బి.సురేందర్ పరిశీలించారు. వారికి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పునరావాసం కల్పించారు. లింగంపేట మండలంలో వర్షాలకు దెబ్బ తిన్న కల్వర్టులను ఎంపీడీవో నరేశ్ పరిశీలించారు. కేశాయిపేట చెరువు వరద ఉధృతి కారణంగా అన్నారెడ్డి పల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. రాకపోకల కోసం తాత్కలికంగా రోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. జగదాంబ తాండా, ఐలాపూర్ గ్రామాల్లో కూలిపోయిన ఇండ్లను పరిశీలించారు. నాగారం వంతెనకు ఇరువైపులా కోతకు గురైన రహదారిని అధికారులు పరిశీలించారు. రాకపోకల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామన్నారు. కోతకు గురైన కల్వర్టులు, రహదారుల విషయమై స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు దృష్టికి తీసుకెళ్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఎంపీడీవో వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, ఎంపీవో మల్హరి, పంచాయతీ కార్యదర్శి సంతోష్, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు రాజు నాయకులు నగేశ్, రామాగౌడ్ ఉన్నారు.

బాధిత కుటుంబాల కోసం పునరావాస కేంద్రం ఏర్పాటు

బాన్సువాడ రూరల్, సెప్టెంబర్ 3 : భారీ వర్షాలకు మండలంలోని బోర్లం గ్రామంలో భారీ వర్షాలకు కూలిన ఇండ్లను పంచాయతీ కార్యదర్శి సాయికుమార్ మంగళవారం పరిశీలించారు. కూలిన ఇండ్ల వివరాలను సేకరించారు. నల్లోల సాయవ్వకు చెందిన నివాసపు గుడిసె కూలిపోవడంతో రోడ్డున పడింది. ఇండ్లు కూలిన బాధితులకు ప్రభుత్వ పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశామని కార్యదర్శి తెలిపారు. ఇండ్లు కూలిన కుటుంబాలకు, శిథిలావస్థలో ఉన్న ఇండ్ల కుటుంబాలు పునరావాస కేంద్రంలో ఉండాలని సూచించినట్లు తెలిపారు.

రామారెడ్డి మండలంలో..

రామారెడ్డి సెప్టెంబర్ 3ః రామారెడ్డి మండలంలో వివిధ గ్రామాల్లో 20 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు తహసీల్దార్ సువర్ణ మంగళవారం తెలిపారు. బాధితుల వివరాలను సేకరించి నష్టపరిహారం వారి ఖాతాల్లో జమచేస్తామని పేర్కొన్నారు.

పునరావాస కేంద్రంలో వైద్య శిబిరం

భారీ వర్షాలకు నిరాశ్రయులైన కుటుంబాలకు అధికారులు రామారెడ్డి జూనియర్ కళాశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. వారిని అక్కడికి తరలించి మండల వైద్యాధికారి డాక్టర్ సురేశ్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించి మాత్రలు అందజేశారు. నిరాశ్రయులకు వివేకానంద ట్రస్టు ఆధ్వర్యంలో భోజన వసతికల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ట్రస్టు సభ్యులు నోముల సందీప్, పటేల్ రాజు,రాకేశ్‌రెడ్డి, బిట్ల అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులను గోపాల్‌పేట పంచాయతీ కార్యాలయానికి తరలించిన అధికారులు

రామారెడ్డిలో కూలిన ఓ ఇల్లు

భవానీపేట్‌లో కూలిన ఇండ్లు..

లింగంపేట్, సెప్టెంబర్ 3: మండలంలోని భవానీపేట్ గ్రామంలోని వడ్ల సత్తయ్య, వడ్ల ఈశ్వరయ్యకు చెందిన ఇండ్లు మంగళవారం కూలిపోయాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ నరేందర్‌గౌడ్ వెంటనే అక్కడికి వెళ్లి కూలిన ఇంటిని పరిశీలించారు. బాధితులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

బాధితులకు వంట సామగ్రి అందజేత

లింగంపేట మండలంలోని నల్లమడుగు గ్రామంలో వినోదకు చెందిన నివాసగృహం కూలిపోయింది. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు స్థానిక నాయకులు ఆమె కుటుంబ సభ్యులను సమీపంలోని పాఠశాలకు తరలించారు. మంగళవారం వారిని మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీయొద్దీన్ పరామర్శించి వంటసామగ్రిని అందజేశారు.

పాల్వంచ మండలంలో పాక్షికంగా ఏడు ఇండ్లు ధ్వంసం

మాచారెడ్డి,సెప్టెంబర్ 3 : పాల్వంచ మండలంలోని భవానీపేటలో నాలుగు, పోతారం లో ఒకటి, బండరామేశ్వర్‌పల్లిలో రెండు ఇండ్లు ఇటీవల కురిసిన వర్షాలకు పాక్షికంగా ధ్వంసమైనట్లు ఎంపీడీవో గోపీబాబు తెలిపారు. ఇండ్లలోకి నీళ్లు వచ్చిన తొమ్మిది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు పేర్కొన్నారు. భవానీపేట ప్రాథమిక పాఠశాలలో ఆరుగురు ,ఆరెపల్లి జీపీలో ముగ్గురికి తాత్కాలికంగా బస కల్పించినట్లు తెలిపారు. పాల్వంచ మండల కేంద్ర శివారులో ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వాగు పరీవాహక ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కపల్లి తండాలో ఒకరి అదృశ్యం

నేనావత్ సర్దార్

లింగంపేట, సెప్టెంబర్3: మండలంలోని ఎక్కపల్లి తండాకు చెందిన నేనావత్ సర్దార్ అదృశ్యమైనట్లు తండావాసులు తెలిపారు. గత నెల 31న లింగంపేటకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లగా.. ఇంత వరకూ తిరిగిరాలేదని పేర్కొన్నారు. సర్దార్ ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు కుటుంబ సభ్యులకు(800805133, 9505409770) లేదా లింగంపేట ఎస్సై(8712686162)కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మద్యం దుకాణంలో చోరీ

లింగంపేట, సెప్టెంబర్ 3: మండల కేంద్రంలోని మద్యం దుకాణంలో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని ఇద్దరు దుండగులు సోమవారం రాత్రి రెండు గంటల ప్రాంతంలో సీసీ కెమెరాలను పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు పేర్కొన్నారు. మద్యం దుకాణాలకు చెందిన షట్టర్‌ను పగులగొట్టి లోనికి ప్రవేశించినట్లు తెలిపారు. చిల్లర డబ్బులతో పాటు మద్యం సీసాలను ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.

నేడు బాన్సువాడలో 'శ్రీ కృష్ణ ఉత్సవం'

బాన్సువాడ, సెప్టెంబర్ 3: బాన్సువాడ డివిజన్ కేంద్రంలోని శ్రీ సరస్వతి ఫంక్షన్ హాలులో బుధవారం శ్రీ కృష్ణ ఉత్సవం నిర్వహించనున్నట్లు కామారెడ్డి జిల్లా ఇస్కాన్ ప్రతినిధి వెంకటదాసు ప్రభూజీ తెలిపారు. మంగళవారం ఆయన బాన్సువాడలో ఉత్సవానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఉత్సవంలో భాగంగా విద్యార్థులకు డ్రగ్స్‌పై వ్యాసరచన పోటీ, భగవద్గీత 12 అధ్యాయాల శ్లోకాల పఠనం, సంప్రదాయ దుస్తుల పోటీ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో బాన్సువాడ ఇస్కాన్ ప్రతినిధులు మల్లికార్జున్, నాగరాజు, అరవింద్ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులు

బాన్సువాడ రూరల్, సెప్టెంబర్ 3 : బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్ శ్రీరాం నారాయణ్‌ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల స్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ -3, తెలుగు -1, ఎకనామిక్స్ -1, హిస్టరీ-1, పొలిటికల్ సైన్స్ -1, కంప్యూటర్ సైన్స్- 1, కామర్స్ -1 చొప్పున ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్ట్‌ల్లో పీజీ చేసిన వారు అర్హులని, ఈ నెల 5వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

మైనార్టీ గురుకుల పాఠశాలలో..

కామారెడ్డి, సెప్టెంబర్ 3 : జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో ఇంగ్లిష్ బోధించడానికి అర్హులైన అభ్యర్థులు నేరుగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6 వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని, పీజీ, బీఈడీ చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9533156532 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గాంధారిలో దెబ్బ తిన్న రోడ్ల పరిశీలన

గాంధారి, సెప్టెంబర్ 3: మండలం కేంద్రంలో దెబ్బతిన్న రోడ్లను పంచాయతీ రాజ్ ఏఈ వెంకటరాములు.. స్థానిక నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. నెహ్రూ చౌరస్తా నుంచి సుభాష్‌రోడ్డు, కమ్మరిగల్లీ, పాత పోలీస్ స్టేషన్, ఎస్సీ కాలనీలో ధ్వంసమైన రోడ్లను పరిశీలించి మాట్లాడారు. త్వరలో బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సూచనల మేరకు ప్రతిపాదనలు పంపించనున్నట్లు చెప్పారు. ఏఈ వెంట నాయకులు తూర్పు రాజు, కామెల్లి బాలరాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల లక్ష్మణ్, గంగి సంతోష్, గంగి రామకృష్ణ. సంగనీ బాబా ఉన్నారు.

రైతువేదికను సందర్శించి ఏడీఏ

రామారెడ్డి, సెప్టెంబర్3: సదాశివనగర్ మండలం పద్మాజీ వాడి ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న రైతువేదికను ఏడీఏ లక్ష్మీ ప్రసన్న సందర్శించారు. రేషన్‌కార్డు లేని రైతులకు రుణమాఫీ వర్తింపజేయనున్న నేపథ్యంలో వారి కుటుంబ సభ్యుల నిర్ధారణ ప్రక్రియను రైతువేదికలో వ్యవసాయాధికారులు చేపట్టారు. ఈ మేరకు ఏడీఏ రుణమాఫీ ప్రక్రియపై అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి, ఏఈవోలు ప్రణీత, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ మండల ప్రత్యేకాధికారిగా తిరుమల ప్రసాద్

నిజాంసాగర్, సెప్టెంబర్ 3: నిజాంసాగర్ మండల ప్రత్యేకాధికారిగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్ మంగళవారం నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండల కార్యాలయానికి రాగా.. ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో అనిత, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పారిశుద్ధ్య నిర్వహణపై సమీక్షించారు. వ్యాధులు ప్రబలకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని కార్యదర్శిని ఆదేశించారు.

రౌడీ షీటర్లలో పరివర్తన రావాలి

బిచ్కుంద, సెప్టెంబర్ 3: తెలిసీ తెలియక చేసిన తప్పులవల్ల సమాజంలో రౌడీషీటర్లుగా ముద్రపడిన యువకుల్లో పరివర్తన రావాలని బిచ్కుంద సీఐ జగడం నరేశ్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పండుగ సమయాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదని, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లాలో 28 మంది ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

కామారెడ్డి,సెప్టెంబర్ 3 : జిల్లాలో 28 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు డీఈవో రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయుల్లో ఒకరు పీజీ హెచ్ఎం, 21 మంది ఎస్ఏలు, ఆరుగురు ఎస్జీటీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించనున్న 'ఉపాధ్యాయుల దినోత్సవం' కార్యక్రమంలో పురస్కారాలను అందజేస్తారని డీఈవో తెలిపారు.

'ఎంఎల్‌హెచ్‌పీ' జాబితా విడుదల